క్లుప్తంగా

ఘనంగా మాదాలమ్మతల్లి తీర్థం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కొత్తపల్లి: మండలంలోని గోర్సలో వేంచేసిన మాదాలమ్మతల్లి తీర్థం శుక్రవారం ఘనంగా జరిగింది. గరగ నృత్యాలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. ఉదయం పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. అమ్మవారి ఆలయం, పరిసర ప్రాంతాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. గోర్స, కొమరగిరి, పండూరు తదితర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గ్రామ సర్పంచ్ రొంగల వీరబాబు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మరిడమ్మకు ఊయల తాళ్ల ఉత్సవం



తాడిచెట్టు మోదును తాళ్లతో తీసుకువస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

పెద్దాపురం: ఆషాఢ మాసంలో ప్రారంభమయ్యే స్థానిక మరిడమ్మ తల్లి జాతర మహోత్సవంలో భాగంగా నిర్వహించే ఊయల తాళ్ల ఉత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాత పెద్దాపురం నుంచి ఆలయ మర్యాదలతో తాటి చెట్టును కొట్టి అక్కడ నుంచి తాళ్లతో మోసుకొచ్చి పురవీధుల్లో ఊరేగించడం ఆనవాయితీ. దీన్ని పురస్కరించుకుని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు, ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో పాత పెద్దాపురం నుంచి తాటిచెట్లకు తాళ్లు కట్టి పట్టణంలో ఊరేగించారు. భారీ జనంతో గరగల నత్యం, డప్పులతో వార్డుల్లో తిరుగుతూ అమ్మవారి గుడికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వెలుగుల సురేష్ పర్యవేక్షణలో బందోబస్తు కల్పించారు.

ఉద్యమకారులకు ఆదర్శం యాసలపు



యాసలపు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెద్దాపురం: ఉద్యమకారులకు యాసలపు సూర్యారావు ఆదర్శప్రాయుడని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ అన్నారు. సూర్యారావు 12వ వర్ధంతిని స్థానిక వరహాలయ్యపేటలోని సూర్యారావు భవనం వద్ద శుక్రవారం కరణం ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించారు. శర్మ మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చూపిన చొరవ, పట్టుదల మరువలేనిదన్నారు. సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్, డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ యువతలో స్ఫూర్తినిచ్చిన నాయకుడు యాసలపు సూర్యారావు అన్నారు. అనంతరం జాతీయ ఉద్యమం, సమకాలిన రాజకీయ పరిస్థితులపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు కూనిరెడ్డి అరుణ, కేదారి నాగు, చల్లా విశ్వనాథం, దాడి బేబీ తదితరులు పాల్గొన్నారు.

రేపు 'హాయిహాయి బాలు పాట హాయి'

బోట్‌క్లబ్: కోన విజయభాస్కరరావు మెమోరియల్ మ్యూజిక్ అసోసియేషన్ 9 వ వార్షికోత్సవాన్ని స్థానిక సూర్యకళామందిరంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్లు సంస్థ నిర్వాహకులు బీవీఎస్ ప్రభాకర్, మార్ని జానకిరామ చౌదరి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగే సినీ సంగీత విభావరిలో గాన గంధర్వ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గానం చేసిన సుమధుర గీతాలను 'హాయిహాయి బాలు పాట హాయి' పేరుతో మాస్టర్ కాళీకృష్ణ సాయినాథ్ ఆధ్వర్యాన సంస్థ కళాకారులు ఆలపిస్తారన్నారు. సంస్థ ఆధ్వర్యంలో సంగీత విద్వన్మణి పెద్దాడ సూర్యకుమారి దంపతులను సన్మానిస్తున్నట్లు చెప్పారు. కాకినాడ పరిసర ప్రాంత ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని గాయనీ గాయకులను ప్రోత్సాహించాలని నిర్వాహకులు కోరారు.

మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్

ఏలేశ్వరం: లింగంపర్తి పరిధిలోని కొండతిమ్మాపురంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్‌ను శుక్రవారం అధికారులు సీజ్ చేశారు. కొండతిమ్మాపురంలో అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే ముందస్తు సమాచారం మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో మట్టి తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్‌ను సీజ్ చేశారు.



అభయాంజనేయ యోగాశ్రమంలో యోగా సాధన



కొండెవరంలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం



నవోదయలో..

యోగాతో మానసిక ఉల్లాసం

- ఉత్సాహంగా యోగా దినోత్సవం
- యోగా ఆవశ్యకతను వివరించిన వక్తలు



బచ్చు ఫౌండేషన్ పాఠశాలలో యోగాసనం వేసిన యశ్వంత్



సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



శాంతివర్ధనలో యోగాసనాలు వేస్తున్న విభిన్న ప్రతిభావంతులు

కొత్తపల్లి: యోగాతో మానసిక ఉల్లాసం, సంపూర్ణ ఆరోగ్యం కలుగుతాయని బీజేపీ కో కన్వీనర్ వాసంశెట్టి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని కొండెవరంలో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వయస్సుల వారు తప్పనిసరిగా యోగా చేయాలన్నారు. యోగా చేస్తే విద్యార్థులకు జ్ఞాపశక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థులకు ప్రత్యేక యోగా తరగతులు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తోట ఏడుకొండలు, బిళ్లకుర్తి రామేశ్వరరావు, జీలకర్ర సత్తిబాబు, దాట్ల సూర్యనారాయణ, కొమ్మినేడి భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: యోగా దినోత్సవాన్ని పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంస్థల్లో గురువుల ఆధ్వర్యంలో పలువురు యోగాసనాలు వేసి, ఆరోగ్య పరిపుష్టి, ఆధ్యాత్మికతపై ప్రసంగించారు. పులిమేరు అభయాంజనేయ యోగా కేంద్రంలో నిర్వాహకులు మసిముక్కల రామకృష్ణ యోగాతో మానసిక ఒత్తిళ్లు దూరమవుతాయని అన్నారు. ఈ సందర్భంగా పలువురితో యోగాసనాలు వేయించి అనంతరం పౌష్టికాహారాన్ని అందజేశారు. యోగా కమిటీ నాయకులు షేక్ ఇస్మాయిల్, తోట శేషయ్య, తుమ్మల చంద్రరావు, పూసల రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రంజిత అంబిక అధ్యక్షతన కేరళకు చెందిన యోగా గురువు బి.సత్యన్ విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. అలాగే శాంతి వర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో డైరెక్టర్ రాయవరపు వీరబాబు ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ సత్య అధ్యక్షతన విద్యార్థులతో యోగాసనాలు వేయించారు.

ప్రశాంత జీవనానికి యోగా

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూలులో ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. జాతీయ స్థాయి యోగా పోటీల్లో గుర్తింపు పొందిన స్థానిక 9వ తరగతి విద్యార్థి కలారి యశ్వంత్ చేసిన యోగాసనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పాఠశాల పీడీ తాళ్లూరి వైకుంఠం విద్యార్థులతో యోగాసనాలు వేయించి అనంతరం సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



రాక్ సిరామిక్స్ గేటు వద్ద బైఠాయించిన కార్మికులు

సామర్లకోట: చర్చల పేరుతో కాలయాపన మాని రాక్ సిరామిక్స్‌లో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. గత 11 రోజులుగా సాగుతున్న ఆందోళనలో భాగంగా రాక్ సిరామిక్స్ కార్మికులు శుక్రవారం ఆ సంస్థ గేటు ఎదుట బైఠాయించారు. క్రాంతి కుమార్ మాట్లాడుతూ రాక్ సిరామిక్స్‌లో పని చేస్తున్న కార్మికులను తొలగించి 66 రోజులు గడిచిందన్నారు. శాంతి యుతంగా ఆందోళన చేస్తూ ఉంటే రోడ్డుపై బైఠాయించడానికి వీలులేదని యాజమాన్యం కార్మికులను బెదిరించడం సరికాదన్నారు. అధికారులు జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులను ఎందుకు తొలగించారో వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు సుబ్బారావు, మూర్తి, చంద్రశేఖర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, రాజబాబు, సతీష్‌కుమార్, గంగాధర్, శివనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తుని రూరల్: మండలం లోవకొత్తూరులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాలలో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకూ మిగిలి ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.రాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఈ నెల 25 వరకూ దరఖాస్తులు తీసుకుంటామని, 27న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కులు ఆధారంగా సీట్లు భర్తీ చేస్తామన్నారు.

విద్యకు పునాది అంగన్‌వాడీ కేంద్రాలు



పిఠాపురంలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

సామర్లకోట: మూడేళ్లు నిండిన చిన్నారులను విద్యపై దృష్టి సారించడానికి అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఎంఈఓ-2 పి.పుల్లయ్య, ఐసీడీఎస్ సీడీపీఓ ఉషారాణి అన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా మండల పరిధిలో అచ్చంపేట గ్రామంలోని ఆయుర్వేద ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని యోగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాలలో సెక్టార్ పరిధిలో చిన్నారులకు ఐసీడీఎస్ సీడీపీఓ ఉషారాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేషన్ డేలో పుల్లయ్య పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మూడేళ్లు దాటిన పిల్లలో అల్లరి ఎక్కువగా ఉంటుందని, వారిని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపడం ద్వారా ఆట పాటలతో కూడిన విద్య నేర్చుకుని, పాఠశాలకు వెళ్లడానికి ఇష్టపడతారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఆరేళ్లు పూర్తి చేసుకున్న చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలన్నారు. గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాల, అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో నేడు బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీరంరెడ్డి చిన్నబాబు, మాజీ సర్పంచ్ సలాది రమేష్, గ్రామ నాయకులు వీరంరెడ్డి పెదబాబు, వెంకన్నబాబు, పాఠశాల హెచ్‌ఎం కేఎంఎంవీ ప్రసాద్, ఉపాధ్యాయులు ఇజ్రాయిల్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సమగ్ర వికాసానికి అంగన్‌వాడీ కేంద్రాలు దోహదం

పిఠాపురం: పిల్లల శారీరక, మానసికాభివృద్ధితో పాటు సమగ్ర వికాసానికి అంగన్‌వాడీ కేంద్రాలు ఎంత గానో దోహదం చేస్తాయని పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ దుర్గాదేవి అన్నారు. అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పిఠాపురం పట్టణం రథాలపేట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే, యోగా డే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లులు తమ పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు పట్టణంలో ర్యాలీ నిర్వహించి అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు అర్బన్ సూపర్‌వైజర్ డి.మణి, దానం కమలారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ బడిలో ఉండాలి : ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: ప్రతీ విద్యార్థి బడిలో ఉండాలని మండల విద్యాశాఖాధికారి వై. శివరామకృష్ణయ్య అన్నారు. నేడు బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని నవర గ్రామంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని మండల పరిషత్తు ఎలిమెంటరీ పాఠశాలను పరిశీలించి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నేడు బడికి పోతా కార్యక్రమంపై ర్యాలీలు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఐసీడీఎస్ పెద్దాపురం ప్రాజెక్టు పరిధిలోని చిన్నారులకు నవర అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్ని చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులు అందరూ ప్రభుత్వ పాఠశాలలో చేరేలా చూడాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎంఈఓ సూచించారు. ఈ సందర్భంగా మండల పరిషత్తు ఎలిమెంటరీ పాఠశాలలో మొక్కలు నాటారు.



అచ్చంపేట అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే



గర్భిణులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న సీడీపీఓ దుర్గాదేవి



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న ఎంఈఓ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లులు

కాడెద్దులు కట్టి... ఏరువాక సాగి..



గొల్లప్రోలు మండలంలో మిరపతోట సాగుకు దుక్కు దున్నుతున్న రైతు



వాణిజ్య పంటల సాగుకు ట్రాక్టర్‌తో దుక్కులు



ఏరువాక పౌర్ణమి సందర్భంగా భూమికి పూజ చేస్తున్న రైతు

పిఠాపురం: కాడి పట్టి జోడెద్దులు కట్టి వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టాడు కర్షకుడు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా అన్నదాతలు శుక్రవారం ఏరువాక సాగి పొలం పనులు ప్రారంభించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వేసవి దుక్కులు దున్ని పంటలకు పొలాలను సిద్ధం చేసుకునే పనిలో రైతన్నలు నిమగ్నమయ్యారు. పలు గ్రామాల్లోని రైతులకు ఖరీఫ్‌కు నారుమళ్ల వేసేందుకు సిద్ధమయ్యారు. పిఠాపురం నియోజకవర్గం వరితో పాటు వాణిజ్య పంటలకు పుట్టినిల్లు కావడంతో పత్తి, మిరప, ఉల్లి, మల్బరీ, పుచ్చ, వంగ, కాబేజీ, చిక్కుడు, పెండలం, బీర తదితర వాణిజ్య పంటల సాగుకు రైతులు భూములను సిద్ధం చేస్తున్నారు. పంట పొలాల్లో పూజలు చేసి ఈ ఏడాది పంటలు పుష్కలంగా పండాలని భూమాతను కోరుకున్నారు.

భీమేశ్వరస్వామికి చక్రస్నానం

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయంవీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామికి చక్రస్నానాన్ని ఎంతో వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి ఎంతో వైభవంగా జరిగింది. ఆలయానికి వచ్చిన భక్తులు ఎటువంటి ఇబ్బందీ కలగకుండా ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సామాన్యుడికి ధరాఘాతం

- మండిపోతున్న కూరగాయల ధరలు
- ఉల్లే కాదు.. అన్నీ కన్నీటికి కారణమే
- పెరిగిన రవాణా చార్జీల వల్లే అంటున్న వ్యాపారులు, వినియోగదారులు

పెరిగిన కూరగాయ ధరలు కిలోల్లో

కూరగాయలు	20 రోజుల క్రితం	ప్రస్తుతం
ఉల్లిపాయలు	రూ.30	రూ.50
టమాటా	రూ.40	రూ.70
బెండకాయలు	రూ.40	రూ.60
చేమదుంపలు	రూ.40	రూ.60
దొండకాయలు	రూ.35	రూ.40
క్యారెట్	రూ.60	రూ.60
పచ్చిమిర్చి	రూ.40	రూ.70
బీట్‌రూట్	రూ.40	రూ.60
వంకాయలు	రూ.40	రూ.60
బంగాళ దుంపలు	రూ.25	రూ.30
బీరకాయలు	రూ.50	రూ.70



సామర్లకోట మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న కూరగాయలు

సామర్లకోట: కూరగాయల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుతున్నాయి. సామర్లకోటలోని రెండు కూరగాయల మార్కెట్‌లలో వ్యాపారస్తులు కూరగాయలను రాజమహేంద్రవరం, కాకినాడ, పిఠాపురం, పెద్దాపురం మార్కెట్ల నుంచి హోల్‌సేల్‌గా కొని తీసుకువస్తారు. అక్కడ చిరు వ్యాపారులకు కావలసిన స్థాయిలో సరకులు రాక పోవడం ఉన్న సరకులను కొనుగోలు చేసుకోవడానికి వారిలో వారికి పోటీ పెరిగి హోల్ సేల్ వ్యాపారస్తులు ధరలు పెంచుతున్నారు. వంటకాల్లో అత్యవసరమైన ఉల్లిపాయల నుంచి పచ్చిమిర్చి వరకు ధరలు విపరీతంగా ఉన్నాయి. గతంలో అధిక వర్షాలతో కూరగాయల తోటలు పాడై ధరలు పెరిగిపోయేవని, నేడు సాధారణ వర్షాలు పడినా కూరగాయల ధరలు ఎక్కువై సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. కూరగాయల రవాణా చార్జీలు విపరీతంగా పెరిగి ఆ భారం కూరగాయలపై పడుతోందని చిరు వ్యాపారులు తెలియజేస్తున్నారు. పెద్ద పెద్ద హోటళ్ల యజమానులు భారీ స్థాయిలో కూరగాయలను ఒకే సారి కొనుగోలు చేసి నిల్వ చేసుకోవడంతో మార్కెట్‌లో కూరగాయలు లభించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

హోల్‌సేల్ మార్కెట్‌లో డిమాండ్..



గతంలో హోల్‌సేల్ మార్కెట్‌లో కావలసిన స్థాయిలో సరకులు ఉండేవి. నేడు నామ మాత్రంగా సరకులు వస్తున్నాయి. వచ్చిన వాటినే అందరూ పోటీ పడి కొనుగోలు చేసుకొవలసి వస్తుంది. రాజమహేంద్రవరం, కాకినాడ, పిఠాపురం, పెద్దాపురం మార్కెట్ల నుంచి కూరగాయలను కొనుగోలు చేసి విక్రయిస్తున్నాం. పచ్చళ్ల కంపెనీల యజమానులు భారీ స్థాయిలో కొనుగోలు చేయడంతో మార్కెట్‌లో కూరగాయల కొరత ఏర్పడుతుంది. గత 30 ఏళ్లుగా కూరగాయల వ్యాపారంపై ఆధారపడి జీవిస్తున్నాం.

– కత్రి రాజు, కూరగాయల వ్యాపారి, సామర్లకోట

చేల గట్లపై కూరగాయల పెంపకం



మండల పరిధిలో 24 వేల ఎకరాల వరకు సాగు భూములు ఉన్నాయి. వరితో పాటు శాగో దుంప, పామాలిన్ పంటలు వేస్తున్నారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో కూరగాయల తోటలు దెబ్బ తిన్నాయి. పొలంబడిలో భాగంగా రైతులకు పంటలతో పాటు కూరగాయలు సాగు చేసుకునేలా అవగాహన కల్పిస్తాం. వంగ, బెండ, బీర, చిక్కుడు, ఆనప, మిర్చి, తోటకూర, గొంగూర వంటి కూరగాయలు వేయడానికి రైతులల్లో అవగాహన పెంచుతాం. ఈ మేరకు కూరగాయల విత్తనాలు ఇవ్వడానికి వ్యవసాయశాఖ సిద్ధంగా ఉంది.

– ఐ.సత్య, వ్యవసాయాధికారి, సామర్లకోట

నీటి కాలుష్య కారక వ్యాధులను నిరోధించాలి

కరప: గ్రామ పంచాయతీల పరిధిలో నీటి కాలుష్యం వల్ల వచ్చే అంటువ్యాధులను నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కె.అప్పారావు సూచించారు. కలెక్టర్ జె.నివాస్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇచ్చిన ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వీవీఎస్ వర్ధన్, గ్రామ కార్యదర్శులతో సమావేశమై నీటికాలుష్య నివారణ చర్యలు, ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రై డే తదితర అంశాలపై సమీక్షించారు. అనుసరించాల్సిన విధి విధానాలను వివరించి, అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం మంచినీటి ట్యాంక్‌లను శుభ్రపరచాలన్నారు. ట్యాంక్ నిండిన వెంటనే తగిన మోతాదులో బ్లీచింగ్ కలిపి క్లోరినేషన్ చేయాలన్నారు. ట్యాంక్‌ల మూతలు, మంచినీటి ట్యాంక్ పైకి ఎక్కే, లోపలకు దిగే మెట్లు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే 15వ ఆర్థికసంఘం నిధులు వినియోగించాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఒక జట్టుగా ఏర్పడి ప్రతిరోజూ ఆయా పంచాయతీల పరిధిలోని వీధులను సందర్శించి మంచినీటి పైపులైన్‌లో, వీధి కుళాయిల వద్ద లీకేజీలు లేకుండా తగిన చర్యలు తీసుకోవడంద్వారా నీటి కాలుష్యాన్ని నిరోధించాలని ఎంపీడీఓ సూచించారు. ప్రతి గ్రామంలో సచివాలయ సిబ్బందితో కల్సి గ్రామకార్యదర్శి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను సందర్శించి తాగునీటి వనరుల వద్ద కాలుష్య నివారణ చర్యులు చేపట్టాలన్నారు. పంచాయతీ స్థాయిలో నీరు, పారిశుధ్య కమిటీ సమావేశాన్ని ఏర్పాటుచేసి నీటికాలుష్యం ద్వారా కానీ, సీజనల్ మార్పువల్ల కానీ వచ్చే వ్యాధులను నియంత్రించేందుకు కమిటీ పర్యవేక్షించాలన్నారు.